క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మునిపల్లిలో అత్తిలి నాగరాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నిడదవోలు రూరల్: రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో అత్తిలి నాగరాజు (45) తలకు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సమిశ్రగూడెం ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మునిపల్లికి చెందిన నాగరాజు శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బైక్‌పై సిలువ సెంటర్ వద్ద రెస్టారెంట్‌కు వెళుతుండగా, బొమ్మూరు నుంచి ఉండ్రాజవరం బైక్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు గ్రామ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన నాగరాజు ఘటనాస్థలంలో మృతి చెందాడు. స్వల్పగాయాలైన ఇరువురిని ఆసుపత్రికి తరలించారు. మునిపల్లిలో నాగరాజు కాఫీ హోటల్ నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. భార్య దుర్గాభవానీతో పాటు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమిశ్రగూడెం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొజిషన్ చూపించాలని వినతిపత్రం అందజేత



తాళ్లపూడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్టలో గత ప్రభుత్వంలో పేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాలకు పట్టాలిచ్చారు కానీ లబ్ధిదారులకు పొజిషన్ చూపించకపోవటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ వల్లభశెట్టి శ్రీనివాస్‌లు తెలిపారు. తాళ్లపూడి తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేసి, లబ్ధిదారులకు పొజిషన్ చూపించాలని కోరారు. గ్రామంలో 57 మందికి ఇంటి పట్టాలు ఇచ్చారని, వారికి పొజిషన్ చూపలేదని తెలిపారు. పొజిషన్ చూపించాలని తాళ్లపూడి ఎంపీపీ జొన్నకుటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఆర్‌టీఐ విభాగం కార్యదర్శి వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభశెట్టి చిన్ని, పాలి రాజు, బొంతా సాయి కోరారు.

వధూవరులకు ఆశీస్సులు



వివాహ వేడుకలో పాల్గొన్న తానేటి వనిత, తలారి వెంకట్రావు

గోపాలపురం: పట్టణ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వీర్లగడ్డ నాగేశ్వరరావు కుమారుడు వెంకటరమణ వివాహానికి మాజీ హోంమంత్రి తానేటి వనిత, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావులు శుక్రవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట నాయకులు కూసం రామమోహన్‌రెడ్డి, ముల్లంగి శ్యామ్ సుందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వెలగా శ్రీరామ మూర్తి పాల్గొన్నారు.

ఆలయంలో తులాభారాలు

దేవరపల్లి: పట్టణంలో ఉన్న బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం పటికబెల్లంతో తులాభారాలు వేశారు. దేవరపల్లికి చెందిన ఆత్మాల సూర్యనారాయణ, భార్య లక్ష్మీకాంతాన్ని పటికబెల్లంతో కుటుంబసభ్యులు తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు. తాడేపల్లిగూడెంకు చెందిన కొంపెర్ల త్రినాథ్, రమ్య కృష్ణ దంపతుల కుమారుడు దర్శిత్ మణి వెంకట్‌ను పటికబెల్లంతో కుటుంబ సభ్యులు తులాభారం వేసి మొక్కు తీర్చుకున్నారు.

నిబంధనలు పాటించాలి

నిడదవోలు: బాణసంచా దుకాణాల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తహసీల్దార్ నాగరాజు నాయక్ ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, పట్టణ ఎస్సై పరమహంస, అగ్నిమాపక అధికారి రాజులతో కలిసి శుక్రవారం బాణసంచా షాపులు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలను పరిశీలించారు. పట్టణంలో గతేడాది ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే ఇప్పుడు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. షాపులను షామియానాల్లో ఏర్పాటు చేయవద్దని, పూర్తిగా రేకుల షెడ్లు వేయాలన్నారు. 16 షాపులకు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.



నిడదవోలు తహసీల్దారు నాగరాజునాయక్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రజాసంఘాల నాయకులు



కొవ్వూరులో ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



గోపాలపురంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, పాత్రికేయులు

కలం గొంతు నొక్కుతారా!

కలానికి సంకెళ్లు వేసి పోలీసుల అక్రమ కేసులతో 'సాక్షి' గొంతు నొక్కుతారా? పత్రిక సంపాదకుడు ఆర్.ధనుంజయ్‌రెడ్డి, సాక్షి సిబ్బందిపై కేసులు పెట్టి వేధించడం తగునా? పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తే పాత్రికేయులు ఎటువంటి పోరాటాలకైనా వెనుకాడమని క్లస్టర్ పరిధిలోని పాత్రికేయులు గళమెత్తారు. ప్రజా సంఘాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘాలు 'సాక్షి' మీడియాపై కక్ష కట్టిన కూటమి ప్రభుత్వ తీరు మార్చుకోవాలంటూ నినాదించాయి. పాలక పక్ష అణచివేతకు గురవుతున్న పత్రికా స్వేచ్ఛను కాపాడాలని గళమెత్తారు.

గోపాలపురం: నకిలీ మద్యం కేసులో ప్రచురించిన వార్తలకు 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, నెల్లూరు బ్యూరో ఇన్‌చార్జి, పాత్రికేయులపై పోలీసులు అక్రమ కేసులు, వేధింపులు, దాడులకు నిరసనగా శుక్రవారం గోపాలపురంలో ఏపీడబ్ల్యుయజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ కె.హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోపాలపురం, నల్లజర్ల, దేవరపల్లి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

నిడదవోలు: కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, అన్యాయలపై గళమెత్తడంతో ప్రజల గొంతుగా నిలిచిన 'సాక్షి'పై చంద్రబాబు సర్కార్ కక్షసాధింపుగా వ్యవహరిస్తోందని నిడదవోలులో తహసీల్దారు కార్యాలయం వద్ద విలేకర్లు, వివిధ ప్రజా సంఘాల నాయకులు ధర్నా చేశారు. కేఎన్‌పీఎస్ జిల్లా ప్రజా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు మాట్లాడుతూ, ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం దారుణమన్నారు. పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపూడి (కొవ్వూరు): 'సాక్షి'పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, వేధింపులను ఆపాలని, పత్రిక స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ ఏపీడబ్ల్యూజే నాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరులోని ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన పాత్రికేయులు ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి ఆర్డీవో రాణి సుస్మితకు వినతిపత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, కేసులు ఎత్తివేయాలని నినాదాలు చేశారు. ప్రెస్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తూ పెడుతున్న అక్రమ కేసులు, వేధింపులు నియంత్రించాలని కోరారు. వార్తలు రాస్తున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రెస్‌క్లబ్ సభ్యులు ఆర్డీవోను కోరారు. కార్యక్రమంలో కొవ్వూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా స్వామినాయుడు, గౌరవాధ్యక్షుడు జీవీ సత్యనారాయణ, తాళ్లపూడి ప్రెస్‌క్లబ్ కన్వీనర్ అప్పన రాజా, పాత్రికేయులు సత్యనారాయణ, కేవీవీ సత్యనారాయణ, తోట అవినాష్, జి.రవికుమార్, కొడమంచిలి శ్రీను, నందూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరించేనా..?

- మట్టి పాత్రలకు తగ్గిన ఆదరణ
- దీపావళి పండగలోనే పని
- యంత్రాల రాకతో కుమ్మరి సారె డీలా

తాళ్లపూడి: కులవృత్తులకు ఒకప్పుడు ఎంతో ఆదరణ ఉండేది. ఎంతోమంది కులవృత్తులపై ఆధారపడి ఉపాధి పొందుతూ కుటుంబాలను పోషించుకునేవారు. అందుకే కులవృత్తి మానకురా గువ్వల చెన్నా అన్నది ఒకప్పటి నానుడి. మారుతున్న కాలనుగుణంగా కులవృత్తులకు ఆదరణ కరువైంది. రేడిమెడ్, ప్లాస్టిక్ వస్తువులు మార్కెట్లను ముంచెత్తుతుండటంతో చేతిపై తయారు చేసే వస్తువులకు గిరాకీ తగ్గింది. సీజన్‌లోనే పని ఉండటంతో చేతి నిండా పని లేక వృత్తిదారులు దిగాలు చెందుతున్నారు. సమాజంలో వస్తున్న మార్పులతో ప్రజల అభిరుచులు కూడా మారడంతో పాటుగా కూటమి ప్రభుత్వం కుల వృత్తులను నమ్ముకున్న వారికి ఎటువంటి సాయం అందించకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు.

కుల వృత్తిని వీడలేక..

కుమ్మర వృత్తికి క్రమేణ ఆదరణ తగ్గుతుంది. దీంతో వృత్తినే నమ్ముకున్న వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇతర రంగాల వైపునకు వలసపోతున్నారు. కేవలం దీపావళి సమయంలోనే పని ఉంటుంది. దీపావళికి కార్పొరేట్ సంస్థలు కూడా ఈ రంగంలోకి రావడంతో కొవ్వొత్తులు, నూనె ఖర్చు లేకుండా వెలిగించే ప్రమిదలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. గతంలో అన్నింటికి మట్టి పాత్రలనే ఉపయోగించేవారు. ప్రస్తుతం స్టీల్, రాగి, కంచు, ప్లాస్టిక్ తదితర వాటితో తయారు చేసిన పాత్రలను, వస్తువులను అధికంగా వినియోగిస్తున్నారు. అన్నింటా ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయింది. ఫలితంగా మట్టి పాత్రల వినియోగం తగ్గడంతో కుమ్మర వృత్తిని నమ్ముకున్న వారు ఉపాధిని కోల్పోతున్నారు. తరతరాల నుంచి వారసత్వంగా వచ్చిన కుల వృత్తి నేడు పొట్ట నింపకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నేటి తరం వారు పూర్తిగా ఈ వృత్తికి దూరమవుతున్నారు. ఇతర పనుల్లోకి వెళ్లిపోతున్న పరిస్థితులు ఉన్నాయి. మరి కొందరు తాతల నాటి నుంచి వస్తున్న కులవృత్తిని వీడలేక మరో పక్క ప్రభుత్వం నుంచి కుడా సాయం అందక బతుకు బండిని భారంగా నడుపుతున్నారు.



వేగేశ్వరపురంలో ఎండబెట్టిన ప్రమిదలు



తాళ్లపూడిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి ప్రమిదలు

తగిన ప్రోత్సాహం లభించక

కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 4 వేల మంది వరకూ ఉండేవారు. ప్రస్తుతం కుమ్మరి వృత్తి చేపట్టే వారి సంఖ్య క్రమక్రమంగా తగ్గుతూ వస్తుంది. సుమారు 400 మంది కూడా పనిచేయని పరిస్థితి నెలకొంది. తాళ్లపూడి మండలంలో సుమారు 150 నుంచి 200 కుటుంబాలు వరకు ఉండేవారు. ప్రస్తుతం కేవలం 25 కుటుంబాలు వారు మాత్రమే కుమ్మర వృత్తిని కొనసాగిస్తున్నారు. వేగేశ్వరపురంలో 13 కుటుంబాల వారు, తాళ్లపూడిలో నాలుగు కుటుంబాల వారు తరతరాలుగా కుమ్మరి వృత్తినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి తగిన ప్రోత్సాహం లభించడం లేదు. కుండలు తయారు చేసే వారు మాత్రం కేవలం ఐదుగురు మాత్రమే ఉన్నారు. పెద్దేవం, అన్నదేవరపేట, తిరుగుడుమెట్ట, రాగోలపల్లి తదితర గ్రామాల్లో కుమ్మరి వృత్తిదారులు ఉన్నారు. పురాతన శాలలపై ఆధారపడకుండా ఇటీవల కరెంట్ సారెలు రూ.20 వేలు పెట్టి సొంతంగా కొనుక్కున్నారు. వాటిపై కేవలం ప్రమిదలు, చిచ్చుబుడ్లు, చిన్నపాటి పాత్రలు మాత్రమే తయారు చేస్తున్నారు.

పెరిగిన ముడిసరకుల ధరలు

మట్టి వస్తువులు తయారీలో ఉపయోగించే ముడిసరకుల ధరలు విపరీతంగా పెరిగాయి. ఆవ శాలలో కాల్చడానికి మట్టి, ఊక, వంట చెరకు ధరలు గతంలో కంటే ఎక్కువగా పెరిగాయి. ఖర్చులు పోగా వచ్చే లాభం సరిపోవడం లేదని వాపోతున్నారు. వేసవిలో కుండలు చేయడంతోపాటు ఇతల మట్టి పాత్రలు కుడా తయారు చేస్తున్నారు. ప్రస్తుతం దీపావళి సమీపిస్తుండటంతో ప్రమిదలు, చిచ్చుబుడ్లు తదితర వాటిని ముమ్మరంగా తయారు చేస్తున్నారు. వివిధ ఆకృతుల్లో ఆకర్షణీయంగా ప్రమిదలు తయారు చేస్తున్నారు. 1000 ప్రమిదలు రూ.900 నుంచి రూ.1000 వరకు విక్రయిస్తున్నారు. 100 చిచ్చుబుడ్లు రూ.600 నుంచి రూ.800 వరకూ కొనుగోలు చేస్తున్నారు. అది కూడా కొందరు వ్యక్తులు ముందుగా కాంట్రాక్ట్ కుదుర్చుకుని చేయించుకుంటున్నారు. ఏటా దీపావళి సీజన్ నుంచి కార్తీక మాసం సీజన్‌లో మాత్రమే తమకు కొంత ఉపాధి దొరుకుతుందని కుమ్మరి వృత్తిదార్లు చెబుతున్నారు. మిగిలిన రోజుల్లో ఇతర పనులకు వెళ్తున్నామని వివరిస్తున్నారు.



వేగేశ్వరపురంలో కరెంట్ సారెపై ప్రమిదలు చేస్తున్న దృశ్యం

తగ్గుతున్న ఆసక్తి

నేటి తరం వారిలో కుమ్మరి వృత్తి పట్ల ఆసక్తి తగ్గుతుంది. దీనికి కారణం ప్రోత్సాహం లేకపోవడంతో పాటు కుండలు మార్కెట్లో కొనుగోళ్లు లేక గిట్టుబాటు కావడం లేదంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంతో శ్రద్ధగా ఓపికతో ఈ పని చేయాలి. గతంలో అందరూ కుండలు చేసేవారు. నేటి తరం వారు ప్రమిదలు, చిచ్చుబుడ్లు లాంటి చిన్నచిన్న పాత్రలను తయారు చేస్తున్నారు. ఇటుకల బట్టీలు, ఇతర పనులకు వెళుతున్నారు. ప్రభుత్వం నుంచి తమకు రుణాలు సక్రమంగా అందడం లేదని, ఇతర సంక్షేమ పథకాలు కూడా అందడంలేదని, తమపై చిన్న చూపు చూస్తున్నారని వారు వాపోతున్నారు.

కుమ్మరి వృత్తిని పోత్సహించాలి



మారుతున్న రోజుల్లో కుమ్మరి వృత్తికి ఆదరణ కరువైంది. దీపావళి సీజన్‌లో మాత్రమే పని ఉంటుంది. కుమ్మర వృత్తిని కొత్తగా ఎవరూ చేయడానికి ముందుకు రావడంలేదు. మార్కెట్లో ముడిసరకుల ధరలు పెరిగిపోయాయి. దీంతో ఇతర పనులకు వెళ్లక తప్పడంలేదు. కుల వృత్తులకు ప్రోత్సాహం అందించాలి. కరెంట్ శాలలు, ఇతర పనిముట్లు సబ్సిడీపై ఇవ్వాలి.

– శ్రీకాకొళపు వెంకటేశ్వరరావు, వేగేశ్వరపురం.

భూముల్లో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు



తుపాకులగూడెంలోని భూముల్లో హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

సాక్షి ఇంపాక్ట్

తాళ్లపూడి: మండలంలోని తుపాకులగూడెం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 49/2పిలో ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూముల విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. సాక్షిలో ఈనెల 16న 'భూములకు హద్దులు చూపాలని ఆందోళన' శీర్షికతో ఇచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం నిషేధాజ్ఞలు ప్రకటించారు. ఆ భూముల వద్దకు ఎవరూ వెళ్లరాదని ఆర్‌ఐ సాహిత్య, వీఆర్వో నాగేశ్వరరావు, కానిస్టేబుల్ సురేష్‌లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

తక్కువ ధరలకే బాణసంచా విక్రయాలు

నిడదవోలు రూరల్: రైతులకు, వినియోగదారులకు డీసీఎంఎస్ ద్వారా తక్కువ ధరలకే బాణసంచా సామాగ్రిని విక్రయిస్తున్నట్లు నిడదవోలు డీసీఎంఎస్ మేనేజర్ ఈ.విజయ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెంలో ఏర్పాటు చేసిన డీసీఎంఎస్ దీపావళి బాణసంచా సామాగ్రి దుకాణంలో శుక్రవారం విక్రయాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, వివిధ కంపెనీలకు చెందిన నాణ్యమైన దీపావళి సామాగ్రి విక్రయించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. డీసీఎంఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బాణసంచా విక్రయిస్తున్న సిబ్బంది

టచ్ చేయొద్దు.. సంస్కారమే హద్దు

- బాలికలను అప్రమత్తం చేస్తున్న పోలీస్ శాఖ
- అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో అవగాహన సదస్సు

నల్లజర్ల: బాలికలు, యువతులు గడపదాటితే అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నారని ఇంటా, బయట వారు ఎదుర్కొనే సవాళ్లను అధిగమించే స్థైర్యాన్ని నింపేందుకు పోలీస్ శాఖ అధ్వర్యంలో ఉన్నత పాఠశాలల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నల్లజర్ల ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. అనంతపల్లి జెడ్పీ హైస్కూలులో శుక్రవారం బాలికలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ మాట్లాడారు. మంచి, చెడు స్పర్శల గురించి వివరించారు. బాలికలు ఏ తరగతి వారైనా ఎదుట వ్యక్తితో మాట్లాడేటప్పుడు కనీస దూరం పాటిస్తూ మంచి, చెడు స్పర్శకు తావీయకూడదన్నారు. పాఠశాలల్లో ఇతర ప్రదేశాల్లో బాలికలు సంస్కారవంతంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల్లో జరిగిన నేరాలు, అనర్థాలను దృష్టిలో పెట్టుకొని సమాజ పరిస్థితులను విశ్లేషిస్తూ బాలికలు, యువతులను చైతన్యపర్చే దిశగా ఈ తరహా కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేయడం, పోక్సో యాక్ట్, మహిళలపై జరిగే దాడులు– రక్షణ చట్టాల గురించి, సైబర్ క్రైమ్స్, శక్తి యాప్ ఏ విధంగా సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయాలో వివరించారు. ప్రధానోపాధ్యాయులు జే.రమేష్ మాట్లాడుతూ, పిల్లల దినచర్య, వ్యవహార శైలిని తల్లిదండ్రులు గమనించాలన్నారు. సహవాసాలపైన దృష్టి పెట్టాలన్నారు. మహిళా సంరక్షణ కార్యదర్శి ఇందిర, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గుడ్, బ్యాడ్ టచ్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

నల్లజర్ల: లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం దూబచర్లలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ రహిత జీవనం– మన సంకల్పం, సమయానుకూల పరీక్షలతో ఆరోగ్య రక్షణ వంటి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అంకాలజిస్ట్ డాక్టర్ రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ, క్యాన్సర్‌పై సమాజంలో అవగాహన పెంచడం చాలా అవసరమన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు ఆరోగ్య చైతన్యం పెంపొందించడం ద్వారా రేపటి సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు, రవివర్మ, పార్డ్ ఇండియా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



దూబచర్లలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు నగదు అందజేత

నిడదవోలు: పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో లయన్స్ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మెంటల్ హెల్త్ అండ్ వెల్ బీయింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం రంగా వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో మెరిట్ విద్యార్థులకు రూ.8 వేల ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పీఎంజేఎఫ్ వావిరాల సరళదేవి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కరుటూరి చౌదరి, కార్యదర్శి గారపాటి మోహన్, కోశాధికారి మట్టపర్తి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించరా!

- అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు
- లాకింగ్ టైల్స్ ధ్వంసం
- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు

నిడదవోలు: పట్టణంలోని గణపతి జంక్షన్ ఐ లవ్ నిడదవోలు పార్కు వద్ద ఎటువంటి అనుమతులు లేకుండా జనసేన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. 'ఎడాపెడా ఏది చేసిన అడిగేది ఎవడంటూ' జనసేన నాయకులు రెచ్చిపోతున్నారు. గత నెలలో మంత్రి కందుల దుర్గేష్ జన్మదినం సందర్భంగా మున్సిపాలిటీ అనుమతులు లేకుండా జనసేన నాయకులు, కార్యకర్తలు స్వామి భక్తిని చాటుకోవడానికి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అవి ఇంత వరకు తొలగించకపోవడంతో ఐ లవ్ పార్కు వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పట్టణంలో ప్రధాన జంక్షన్‌గా గణపతి జంక్షన్ ఉంది. ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. నిత్యం వందలాది వాహనాలు ఈ జంక్షన్ మీదగా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ట్రాఫిక్ ఇబ్బందులు ఉన్నా పోలీసులు, మున్సిపల్ అధికారులు మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహించడంతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.కోటి వ్యయంతో గణపతి జంక్షన్‌లో సీసీరోడ్లు, డ్రైయిన్‌లు నిర్మించారు. ఇక్కడే రుడా నిధులు రూ.67 లక్షల వ్యయంతో ఐ లవ్ నిడదవోలు పార్కు ఏర్పాటు చేశారు. సెంట్రల్ విద్యుత్ వెలుగులు, పార్కు వద్ద లాకింగ్ టైల్స్‌తో సుందరీకరించారు. ప్రజలు పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లించగా.. మున్సిపల్ సాధారణ నిధులతో పట్టణంలో పనులు చేస్తుంటే జనసేన నాయకులు ఇష్టారీతిన వాటిని ధ్వంసం చేస్తున్నారనే విమర్శలున్నాయి. పార్కు చుట్టూ ఉన్న లాకింగ్ టైల్స్‌ను ఇష్టమొచ్చినట్లు తవ్వేసి భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా భారీ ఫ్లెక్సీలను తొలగించే చర్యలు చేపట్టి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, తవ్వేసిన లాకింగ్ టైల్స్‌ను తిరిగి ఏర్పాటు చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



నిడదవోలు గణపతి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు